ఇంటింటా సోలార్ వెలుగులు

- పీఎం సూర్యఘర్‌తో సోలార్ ప్యానల్స్‌పై సబ్సిడీ
- విద్యుత్ బిల్లుల భారం నుంచి విముక్తి
- సోలార్‌తో విద్యుత్ సమస్యలకు చెక్


సాయిబాబా ఆలయంపైన ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్స్

దెందులూరు: పీఎం సూర్యఘర్‌తో నిరంతర వెలుగులు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. సోలార్‌తో ఇంటింటా నిరంతరాయంగా విద్యుత్ కాంతులు వెదజల్లడంతో పాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తిని ప్రొత్సాహించేలా కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజనను అమలు చేస్తోంది. భవనం పైభాగంలో సోలార్ రూఫ్‌టాప్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేసుకొని సొంతంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేసి వినియోగించుకోవడంతో పాటు అదనపు విద్యుత్‌ను గ్రిడ్‌కు తరలించొచ్చు. నిరంతర విద్యుత్‌తో పాటు విద్యుత్ అంతరాయాలు, లోఓల్టేజ్, విద్యుత్ బిల్లుల సమస్యలకు చెక్ పెట్టేలా ఈ పథకాన్ని రూపొందించారు. పెట్టుబడి సులభంగా తిరిగి రావడంతో పాటు సోలార్ ప్యానల్ ఏర్పాటుకు ప్రభుత్వం సబ్సిడీ అందించడంతో ఈ పథకానికి స్పందన బాగుంది. దెందులూరు నియోజకవర్గంలో విద్యుత్ వినియోగదారులు సూర్యఘర్ పథకంపై ఆసక్తి చూపుతున్నారు. ఇప్పుడిప్పుడు ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, దేవాలయాలు, అపార్ట్‌మెంట్లు, ఇళ్లకు సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తిని చేసి వినియోగిస్తున్నారు.

ఇంటిపై భాగంలో ప్యానల్స్ ఏర్పాటు

విద్యుత్ అధికారుల ఆమోదంతో ఆయా గృహాలపై సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేస్తారు. భవనం పైభాగంలో కొంత చదరపు అడుగుల స్థలంలో సోలార్ ప్యానల్స్ అమరుస్తారు. ప్రస్తుతం వాడే విద్యుత్ మీటరు స్థానంలో నెట్‌మెట్రీ ఏర్పాటు చేసి దీని ద్వారా సోలార్ విద్యుత్ వినియోగం లెక్కిస్తారు. అలాగే అదనపు విద్యుత్‌ను ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తారు.

సులభంగా పెట్టుబడి వెనక్కి

సబ్సిడీ, బ్యాంకు రుణంతో పాటు పెట్టుబడి ఆరు, ఏడేళ్లలో తిరిగి వస్తుంది. సూర్య ఘర్ ప్యానల్స్ ఏర్పాటు చేసిన 30 రోజుల్లో వినియోగదారుల ఖాతాలో జమ చేస్తారు. ముందుగా వినియోగదారుడి తమ బ్యాంకు ఖాతా వివరాలను అప్‌లోడ్ చేయాలి. 100 చదరపు అడుగుల్లో ఏర్పాటు చేసిన కిలో వాట్ రూఫ్‌టాప్ కెపాసిటీ విద్యుత్ ఉత్పత్తికి 3–4 ప్యానళ్లను వినియోగిస్తారు.

పథకం పొందండిలా

- పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పొందేందుకు గృహ విద్యుత్ వాడకం 300 యూనిట్ల లోపు ఉండాలి.
- పథకం కోసం మొబైల్‌లో సూర్యఘర్ యాప్‌ను అప్‌లోడ్ చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులో వినియోగదారుడి వివరాలు నమోదు చేయాలి.
- ఆరు నెలల విద్యుత్ బిల్లుల కాపీలను జత చేసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి.
- రిజిస్ట్రేషన్ ఫీజు కిలో వాట్లను బట్టి చేయించుకోవాలి.
- 5 వాట్లకు రూ.1900, 5 వాట్లకు పైబడితే రూ.5900 చెల్లించాలి, 10 కిలో వాట్లు పైబడిన హెచ్‌డీ సర్వీసుదారులు రూ.11,800 చెల్లించాలి.
- 3 కిలో వాట్ల సర్వీసులకు ఫీజు లేదు. అనంతరం ట్రాన్స్‌కో అనుమతులు పొందిన తరువాత వెండర్లను ఎంపిక చేసుకోవాలి.
- కిలో వాట్లను బట్టి సబ్సిడీ మంజూరు చేస్తారు.
- మిగిలిన సొమ్ము మొత్తానికి బ్యాంకు రుణ సదుపాయం కల్పిస్తారు.
- వినియోగదారులు వాయిదాల పద్ధతిలో రుణం చెల్లించాల్సి ఉంటుంది.

స్పందన బాగుంది



దెందులూరు నియోజకవర్గంలో సూర్యఘర్ పథకం కోసం దరఖాస్తులు వస్తున్నాయి. మంచి పథకం, స్పందన బాగుంది. సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకున్న వినియోగదారులు నిరంతర విద్యుత్ పొందొచ్చు. పెట్టిన పెట్టుబడి త్వరగానే వస్తుంది. రూఫ్‌టాప్ కోసం విద్యుత్ సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబర్ 1912కు కాల్ చేయొచ్చు.

– పి.సాల్మన్‌రాజు, ఎస్ఈ, ఏలూరు ట్రాన్స్‌కో

స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యం కావాలి



గ్రామ శివారు ప్రాంతాల్లో ప్రతి ఒక్కరూ నిరంతర విద్యుత్ సౌకర్యాన్ని పొందాలి. ప్రజలకు తక్కువ ధరకు విద్యుత్ పొందడానికి సోలార్ వినియోగంపై స్వచ్ఛంద సంస్థలు సామాజిక బాధ్యతగా ప్రచారంలో భాగస్వాములు కావాలి. క్షేత్ర స్థాయిలో సభలు, సమావేశాలు, ర్యాలీలు, కరపత్రాల ద్వారా అవగాహన కల్పించాలి.

– సీహెచ్ అవినాష్‌రాజు, లయన్స్ క్లబ్ డైరెక్టర్, పెదవేగి

రైతులకు మరింత మేలు



గృహ అవసరాలతో పాటు దేవాలయాలు, అపార్ట్‌మెంట్లు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలతో పాటు రైతులకు సోలార్ విద్యుత్ వాడకం ఎంతో మేలు చేస్తుంది. రైతు సంఘాలు, రైతు నాయకులు సోలార్ విద్యుత్ వినియోగంపై మరింత అవగాహన కల్పించాలి. విస్తృతంగా ప్రచారం చేయాలి. రైతులను మరింత చైతన్యవంతం చేయాలి.

– వీరమాచినేని శివాజీ, ఆదర్శ రైతు, దెందులూరు

గిరిజనులకు సికిల్ సెల్ అనీమియా పరీక్షలు


గిరిజనులకు రక్త పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి, సిబ్బంది

గణపవరం: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు గణపవరం పీహెచ్‌సీ పరిధిలోని గిరిజనులకు సికిల్ సెల్ ఎనీమియా రక్త పరీక్షలు చేపట్టినట్లు వైద్యాధికారి ఓంకార్‌నాథ్ తెలిపారు. శుక్రవారం గణపవరంలోని మసీదు వీధి, వడ్డిగూడెం ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజన కుటుంబాలకు చెందిన నలభై ఏళ్ల లోపు వయస్సు ఉన్న 22 మందికి సికిల్‌సెల్ రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ సికిల్ సెల్ వ్యాధి ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో నివసించే వారికి వస్తుందని, ఆరు నెలల నుంచి 16 ఏళ్ల వయస్సు ఉన్న వారికి ఎక్కువగా వస్తుందని దీని లక్షణాల వలన ఎర్ర రక్త కణాలు కొడవలి ఆకారం, అర్ధ చంద్రాకారంలోకి మారతాయన్నారు. ఈ వ్యాధి సోకడం వలన తీవ్ర ఆరోగ్య సమస్యలు ఏర్పడి ప్రాణాంతకంగా మారుతుందన్నారు. సీహెచ్‌వో జాలాది విల్సన్, పీహెచ్ఎన్ సత్యవతి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదవేగి: పెదవేగి సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు నిమిత్తం ఈ నెల 28వ తేదీ శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పెదవేగి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ శాఖ ఈఈ కేఎం అంబేడ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున వినియోగదారులు గమనించి సహకరించవలసినదిగా ఆయన కోరారు.

క్లుప్తంగా

రెండు గ్రామాల్లో జిల్లా అధికారుల తనిఖీ


వాటర్ ట్యాంక్‌లను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

దెందులూరు: తాగునీటి సరఫరా పర్యవేక్షణలో ఎటువంటి అలసత్వం వహించొద్దని జిల్లా పరిషత్ సీఈవో ఎం.శ్రీహరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని కొవ్వలి, దోసపాడు గ్రామాల్లో సీపీడబ్ల్యూఎస్ వాటర్ స్కీంలను జిల్లా అధికారులు సీఈవో శ్రీహరి ఆర్‌డబ్ల్యూఎస్ డీఈడీ రామారావు, ఆర్‌డబ్ల్యూఎస్ సీఐ సీహెచ్‌ఆర్‌ఆర్‌కే వర్మ, దెందులూరు ఎంపీడీవో భీమరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెండు గ్రామాల్లో నీటి నమూనాలు తీసుకెళ్లారు. గ్రామాల్లో ఉన్న తాగునీటి సరఫరా నాణ్యత, లీకేజీలు, స్టోరేజ్ వాటర్ ట్యాంకుల సామర్థ్యం, ఫిల్టర్ బెడ్లు, బ్లీచింగ్, క్లీనింగ్, పారిశుద్ధ్యంతో పాటు సీపీడబ్ల్యూఎస్ స్కీమ్‌కు సంబంధించి అన్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

పీజీ అర్హత పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ విశ్వేశ్వరావు, అధ్యాపకులు

ఉంగుటూరు: పీజీ అర్హత పరీక్షల్లో నారాయణపురం అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచినట్లు ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు వెల్లడించారు. ఈ మేరకు విద్యార్థులను శుక్రవారం కళాశాలలో అభినందించారు. ఎంఎస్సీ ఫిజిక్స్‌లో శీతాల లిఖితా రాణి స్టేట్ 21వ ర్యాంకు, ఎం.శ్రీనివాస్ స్టేట్ 155వ ర్యాంకు, ఎంఎస్సీ జువాలజీలో కుక్కల దేవి స్టేట్ 311వ ర్యాంకు, ఎంఎస్సీ మ్యాథమేటిక్స్‌లో, కంప్యూటర్ సైన్సులో ముత్యం చందుబాబు ఏపీ సెంట్రల్ యూనివర్శిటిలో, పాండిచ్చేరి సెంట్రల్ యూనిర్శిటీలో సీట్లు సాధించారని ఆయన తెలిపారు. చందుబాబు ఎన్ఐటీ, ఎంసీఏ (నిమ్ సెట్) కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లో ఆలిండియా 5676వ ర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. అకడమిక్ కో–ఆర్డినేటర్ కొండా రవి, వైస్ ప్రిన్సిపాల్ రెడ్డియ్య, అధ్యాపకులు పి.బాబూరావు, టీవీ రెడ్డి, జి.నిర్మల జ్యోతి,పాల్గొన్నారు.

వైద్యం కోసం మిత్రుల సాయం


సాయం అందజేస్తున్న స్నేహితులు

ఉంగుటూరు: మిత్రుడి కుమార్తె బిల్డింగు పైనుంచి పడిపోవడంతో స్నేహితులు రూ.50 వేలు పోగు చేసి మిత్రుడుకి అందజేశారు. కైకరం గ్రామానికి చెందిన జొన్నాడ చిన అప్పన్న కుమార్తె ఆడుకుంటూ బిల్డింగు పైనుంచి కింద పడిపోయింది. దీంతో వైద్యం నిమిత్తం రూ.4 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. వైద్య ఖర్చుల నిమిత్తం తమ వంతుగా రూ.50 వేలను మిత్రుడు అప్పన్నకు అందజేశారు. మాజీ ఎంపీటీసీ కూన అప్పారావు ఆధ్వర్యంలో ఈ నగదు సేకరించారు.

ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం


బాధితుడికి ఆర్థిక సాయం అందజేస్తున్న గౌడ సంఘం నాయకులు

పెదపాడు: ప్రమాద బాధితుడికి ఏపీ గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందించారు. పెదపా డు మండలంలోని కొక్కిపాడు గ్రామ శివారు వేంపాడు గ్రామానికి చెందిన వంగల కొండలరావు ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడంతో గౌడ సంఘం తరపున రూ.23 వేలు ఆర్థిక సాయమందించారు. ఏపీ గౌడ సంఘం చైర్మన్ బొమ్మగాని బాలకృష్ణన్, బైగాని రంగారావు, మారగాని శ్రీనివాసరావు, పరసా నాగ శ్రీను, వీరంకి అయ్యప్ప స్వామి, మోదుగుమూడి వెంకట్, మాదు గంగాధరరావు,బెజవాడ నర్సింహరావు, పులిచర్ల నాగబాబు, వేముల రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి

ఏలూరు టౌన్: ఏలూరు సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో సుమారు 50 ఏళ్ల వయసు గల మహిళ ఒంటరిగా తిరుగుతుంది. గుర్తు తెలియని ఈ మహిళ ఈనెల 25న అస్వస్థతకు గురవడంతో సిబ్బంది జీజీహెచ్‌లో చేర్పించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఆమె ఆరోగ్య స్థితి విషమించటంతో శుక్రవారం రాత్రి మృతి చెందింది. మృతదేహాన్ని మార్చురీకి తరలించిన వైద్య సిబ్బంది జీజీహెచ్ ఔట్‌పోస్ట్ పోలీసులకు సమాచారం అందించారు.

కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ అండ


ఎ.గోకవరంలో బాలుడిని పరామర్శిస్తున్న వాసుబాబు

ఉంగుటూరు: వైఎస్సార్‌సీపీ సలహా కమిటీ సభ్యులు, ఉంగుటూరు నియోజకవర్గ పార్టీ కన్వీనర్ పుప్పాల వాసుబాబు శుక్రవారం ఉంగుటూరు మండలంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను, పలువురిని పరామర్శించారు. ఎ.గోకవరం వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటి అధ్యక్షుడు కొండ రవికిరణ్ తండ్రి జయప్రకాష్ మూర్తిరాజు ఇటీవల గుండె శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఆయనను పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న కూరపాటి రాఘవేంద్రరావు కుమారుడు అభిని పరామర్శించారు. కైకరం వైఎస్సార్‌సీపీ నాయకుడు యెలిశెట్టి శ్రీనివాసరావు (వైఎస్) అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనను కైకరంలో ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. వారికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మరడ మంగరావు, యెలిశెట్టి పాపారావు బాబ్జి, పుప్పాల గోపి, కొరిపల్లి శ్రీను, పెనుగొండ బాలకృష్ణ, ఎ.గోకవరం సర్పంచి మిద్దే సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పెరుగుతున్న అనధికార లేఅవుట్లు


చేబ్రోలులో వేసిన లేఅవుట్

ఉంగుటూరు: గ్రామ పంచాయతీలోల అనధికార లేఅవుట్లు పెరుగుతున్నాయి. దీంతో పంచాయతీ ఆదాయనికి గండి కొడుతున్నట్లు అవుతుంది. గ్రామాల్లో ఇళ్ల స్థలాలకు గిరాకీ పెరగడమే దీనికి కారణంగా కనిపిస్తుంది. దీని వలన పట్టణాలు, నగరాలకే పరిమితమయ్యే రియల్ ఎస్టేట్ వ్యాపారం గ్రామాల్లోకి అడుగు పెట్టింది. గ్రామ శివారు ప్రాంతాల్లో లేఅవుట్లను వేస్తున్నారు. రహదారులు నిర్మించి చూపరులను ఆకర్షించేలా చేస్తున్నారు. ఇంచుమించుగా పట్టణాల ధర పలకిస్తున్నారు. ద్వితీయ శ్రేణి పట్టణాలుగా రూపాంతరం చెంది, జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న కైకరం, చేబ్రోలు, నారాయణపురం, ఉంగుటూరు గ్రామాల్లో ఈ రియల్ వ్యాపారం విస్తరిస్తోంది. అయితే పంచాయతీలకు రావాల్సిన ఆదాయం వస్తుందా లేదా అనేది ప్రశ్నార్థకం. వ్యవసాయ భూమిని మార్పు చేస్తే రెవ్యూ అనుమతులు పొందాల్సి ఉంటుంది. దీనికి కొంత నగదు ప్రభుత్వానికి చెల్లించాల్సి వస్తోంది. నామినల్‌గా ఏదో కట్టేసి అనుమతులు పొందినట్లు నటించి వ్యాపారం చేస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

ఘనంగా జగన్నాథుని రథోత్సవం


జగన్నాథ రథోత్సవంలో పాల్గొన్న ఒరిస్సా వాసులు, భక్తులు

భీమడోలు: పూరీలో జగన్నాథ రథోత్సవాన్ని పురస్కరించుకుని భీమడోలులోని ఒరిస్సా వాసులు శుక్రవారం రాత్రి పోలసానిపల్లి నుంచి భీమడోలు జంక్షన్ మీదుగా గ్రామంలోకి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పూరీలోని జగన్నాథ దేవాలయంలో కొలువైన దేవతామూర్తులు జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర రత్నబేడి వేదికపై ఉంటారు. జగన్నాథుడు విష్ణువు అవతారంగా భక్తులు సంప్రదాయబద్ధంగా కొలుస్తారు. జగన్నాథుడుకి బలభద్రుడు, సుభద్రలు సోదరుడు, సోదరిగా పూజిస్తారు. పూరీ తరహాలో ఇక్కడ విశేషంగా అలంకరింపబడిన రథంలో ఆ దేవతామూర్తులను ఉంచి అర్చకులు మంత్రోచ్చరణల మధ్య గ్రామోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఒరిస్సా వాసులు విరాన్, మిథున్, సీతారామ్, మన్మథ్, పంచానంద్, సలాది రామ్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అతిసారపై అప్రమత్తంగా ఉండాలి


అతిసార వ్యాధిపై అవగాహన ప్రదర్శన చేస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: వర్షాల సీజన్ ఆరంభమైనందున మంచినీటి వనరులు కలుషితం కావడం, వాతావరణం మార్పుల వలన అతిసార వ్యాధి విజృంభించే అవకాశం ఉందని ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. అతిసార వ్యాధి లక్షణాలు, రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహ కల్పిస్తూ శుక్రవారం వైద్య సిబ్బంది, మండల పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ జంపన పద్మావతి రమేష్‌రాజు, జిల్లా పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అతిసారపై అవగాహన కలిగి ఉంటే ఈ వ్యాధికి దూరంగా ఉండొచ్చన్నారు. ఈ మేరకు ఇంటింటికీ తిరిగి అతిసార వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అధ్వాన రహదారులతో ఇక్కట్లు


అధ్వానంగా ఉన్న సీతంపేట-కొత్తగూడెం రహదారి

దెందులూరు: సీతంపేటలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారింది. రైల్వే గేట్ నుంచి కొత్తగూడెం వెళ్లే రోడ్డు నడవడానికి కూడా వీల్లేని విధంగా ఉంది. ఈ రోడ్డులో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు, ఎడ్లబళ్ల రాకపోకలతో రోడ్డు మరింత అధ్వానంగా తయారైంది. వందలాది మంది అనునిత్యం ఈ రోడ్డుపై రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు పాడైపోయిన సీతంపేట రోడ్డును పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మీరే నన్ను బతికించారు సారూ..


పెదవేగి: మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరిని సత్కరిస్తున్న కిడ్నీ బాధితుడు

పెదవేగి: మీరే ఆ రోజు నన్ను ఆదుకొని బతికించారని పెదవేగి మండలం, విజయరాయికి చెందిన సాంబశివరావు, దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. జంగాలపేటకు చెందిన వారణాసి భద్రం, భద్రకేలమ్మ దంపతుల కుమారుడు 19 ఏళ్ల వారణాసి సాంబశివరావుకు గత ఏడాది జనవరిలో తీవ్రమైన కిడ్నీ సమస్య వచ్చింది. దీంతో రెండు మూత్ర పిండాలు పాడయ్యాయని వైద్యులు తేల్చి చెప్పేశారు. దీంతో దిక్కు తోచని పరిస్థితుల్లో స్థానిక పెద్దలు అప్పటి ఎమ్మెల్యేగా ఉన్న అబ్బయ్యచౌదరికి సమస్య వివరించారు. స్పందించిన అబ్బయ్య చౌదరి, అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వారంలో రూ.7 లక్షల సీఎంఆర్‌ఎఫ్ నిధులను అందించి, చికిత్సకు ఏర్పాటు చేసి, 2024 జనవరిలో తల్లి భద్రకేలమ్మ అందించిన కిడ్నీతో హైదరాబాద్‌లో శస్త్ర చికిత్స చేయించారు. దీంతో పూర్తిగా కోలుకున్న సాంబశివరావు, అబ్బయ్య చౌదరిని శుక్రవారం కలిసి తన సంతోషాన్ని వ్యక్తం చేసి సత్కరించారు. పురాణం మారయ్య, సీహెచ్ పగిడియ్య, కల్యాణం సాంబ య్య, పురాణం పగిడియ్య, వారణాసి కృష్ణ పాల్గొన్నారు.

అబ్బయ్య చౌదరితో సర్పంచుల సమీక్ష


దెందులూరు: మాజీ ఎమ్మెల్యేను కలిసిన సర్పంచులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

దెందులూరు: మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరిని ఆయన కార్యాలయంలో శుక్రవారం పలు గ్రామాల సర్పంచులు, నాయకులు కలిశారు. గ్రామాల్లో ప్రధాన సమస్యలు ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాల్లో వివక్షత వేధింపులు అక్రమ కేసులు అబ్బయ్య చౌదరి దృష్టికి తీసుకెళ్లారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం వేధింపులు, అక్రమ కేసుల పట్ల అధైర్య పడొద్దని వ్యక్తిగతంగా పార్టీ పరంగా తాను అండగా ఉంటానన్నారు. సానిగూడెం సర్పంచ్ సరిపల్లి రామకృష్ణ (విష్ణు) కేడీ పురం సర్పంచ్ వర్రి లక్ష్మీదుర్గా నారాయణరావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు గండి బాలకృష్ణ ప్రసన్న, గంటా సీతారాం, ఫ్రాన్సిస్, సీనియర్ నాయకులు మోటాపర్తి గాంధీ, మురకాడ పరుశురాం, తదితరులు పాల్గొన్నారు.

సీఐగా రజనీ కుమార్



గణపవరం: గణపవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా రజనీ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి గణపవరం సీఐగా బదిలీ అయ్యారు. ఇక్కడ సీఐగా పని చేస్తున్న ఎంవీ సుభాష్ జంగారెడ్డిగూడెం సీఐగా బదిలీ అయ్యారు. సీఐగా బాధ్యతలు తీసుకున్న రజనీకుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ గణపవరం పట్టణం, నారాయణపురం, పిప్పర సెంటర్లలో విపరీతంగా ఉన్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. సర్కిల్ పరిధిలో పేకాట, కోడి పందేలు వంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటానన్నారు. బాధ్యతలు స్వీకరించిన సీఐ రజనీకుమార్‌ను గణపవరం ఎస్సై మణికుమార్, నిడమర్రు ఎస్సై వీరప్రసాద్, చేబ్రోలు ఎస్సై సూర్యభగవాన్ మర్యాద పూర్వకంగా కలిశారు.

మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి


ఎస్సై శివాజీ

దెందులూరు: పోలీస్ స్టేషన్ పరిధిలోని కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, కుటుంబ తగాదాలు, భూ తగాదాలు, మోటార్ సైకిళ్ల యాక్సిడెంట్, చిట్ ఫండ్ వంటి కేసులు, ఇతర కేసులు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని ఎస్సై శివాజీ అన్నారు. శుక్రవారం దెందులూరు పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ పరస్పరం కేసులు పెట్టుకున్న ఇరు వర్గాల వారు ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరుగకుండా రాజీ చేసుకునే అవకాశం లోక్ అదాలత్ కల్పించిందన్నారు. అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు జరుగుతున్న పైడిపాక ప్రాంతంలో సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. వీరిని హుటాహుటిన పోలవరం వైద్యశాలకు తరలించగా, ప్రాథమిక చికిత్స అందించి, 108 అంబులెన్స్‌లో మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి తరలించారని ఎస్సై ఎస్ఎస్ పవన్ కుమార్ తెలిపారు. పోలవరం ప్రాజెక్టులో సబ్ కాంట్రాక్టర్ వద్ద పని చేస్తున్న నౌషద్ ఆలం, బిజయ్‌కుమార్‌తో కలిసి మోటార్ సైకిల్‌పై వెళుతుండగా, ఎదురుగా వస్తున్న బొలేరో వాహనం ఢీకొందన్నారు. ఇద్దరికీ గాయాలయ్యాయని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు.

సీతారాములకు విశేష పూజలు


స్వామి వారికి తలంబ్రాలు పోస్తున్న అర్చకులు


సుందర సీతారామ స్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు

భీమడోలు: గుండుగొలనులో వేంచేసియున్న శ్రీసీతారామ స్వామి ఆలయంలో స్వామి వారి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకొని శుక్రవారం అభిషేకాలు, శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఫౌండర్ కొండ గంగరాజ్‌కుమార్ ఆధ్వర్యంలో యాజ్ఞిక స్వామి, ఆలయ పూజారి సుధీరాచార్యులు జన్మ నక్షత్రం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామి వారికి స్నపన, శాంతి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వారిని సుందరంగా అలకరించారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

సుందర సీతారామ స్వామికి అభిషేకం

ఉంగుటూరు: కైకరం కళింగ రామాలయంలో వేంచేసియున్న సుందర సీతారామ స్వామికి శుక్రవారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామి వారి జన్మ నక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని అత్యంత భక్తి శ్రద్ధలతో పంచామృత అభిషేకంతో పాటు కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. కుంకమ పూజలు విశేషంగా శక్తి స్వరూపిణి అయిన సీతాదేవికి అర్చకురాళ్ల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ నిర్వహకులు కూనా అప్పారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

ఆక్వా దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు


ఆక్వా దుకాణంలో ఎరువులను పరిశీలిస్తున్న అధికారులు

భీమడోలు: గుండుగొలనులో ఆక్వా దుకాణాలను శుక్రవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందం ఆకస్మిక తనిఖీలు చేశారు. జిల్లా జేసీ ధాత్రిరెడ్డి ఆదేశాల మేరకు ఎంపెడా, మత్స్య శాఖ, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్, రెవెన్యూ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో అధికారుల బృందం గుండుగొలనులోని ఐదు ఆక్వా షాపుల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటి (సీఏఏ) ధృవీకరించిన మందులు, రసాయనాలు, యాంటి బయోటిక్స్ క్రయ విక్రయాలపై నిశితంగా పరిశీలించారు. జిల్లా మత్స్య శాఖ అధికారి బి.నరసయ్య, ఎంపెడా అధికారి దుర్గారావు తదితర అధికారులు దుకాణాల్లోని రికార్డులను పరిశీలించారు. స్టాకు, రికార్డుల నిర్వహణ తీరుపై బృందం సభ్యులు సంతృప్తిని వ్యక్తం చేశారు. భీమడోలు ఎఫ్‌డీవో ఎన్.దుర్గాభవానీ, వీఆర్వో డి.సింహాచలం, వీఎఫ్ఏలు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు, దుస్తుల పంపిణీ


విద్యార్థులకు బ్యాగులు, దుస్తులను పంపిణీ చేస్తున్న మాజీ సర్పంచ్

దెందులూరు: దుస్తులు, బ్యాగులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గోపన్నపాలెం మాజీ సర్పంచ్ కొండేటి హనుమంతు అన్నారు. శుక్రవారం కొత్తపల్లి గ్రామంలోని రెండు ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు దుస్తులు, బ్యాగులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ నాయకులు చింత సుబ్బారావు, మారగాని సత్యనారాయణ, కేబుల్ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.